16న దేశవ్యాప్త కార్మికుల గ్రామీణ భారత్ సమ్మె


జవహర్‌నగర్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

జవహర్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల గ్రామీణ భారత్ సమ్మెను విజయవంతం చేయాలని భవన కార్మిక సంఘం మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం యాదగిరి పిలుపునిచ్చారు. సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త కార్మికుల గ్రామీణ భారత్ సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శివనారాయణ, శివబాబు, ప్రవీణ్, ధన్‌రాజ్, తిరుపతి, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

గావ్ చలో అభియాన్


కేంద్ర పథకాలను వివరిస్తున్న కౌన్సిలర్, బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: బీజేపీ చేపట్టిన గావ్ చలో అభియాన్‌లో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని 39వ బూత్‌లో కౌన్సిలర్ హంస రాణికృష్ణగౌడ్ బస్తీయాత్ర నిర్వహించారు. బీజేపీ బూత్ అధ్యక్షుడు అభిలాష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి మహేశ్‌తో కలిసి అంగన్‌వాడీ కేంద్రం, బస్తీ దవాఖానను సందర్శించి వారికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పథకాలు, రాష్ట్రానికి అందిస్తున్న సేవలను వివరించారు. బస్తీ ప్రజలకు బీజేపీ ప్రభుత్వం పథకాలను తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: నారపల్లిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను చైర్మన్ కొండల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారపల్లిలోని గణేష్‌నగర్‌లో రూ.12.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనరెడ్డి, ఏఈ నరేష్ కుమార్, నాయకులు అబ్బవతిని నర్సింహ, బాలరాజు, డా.లక్ష్మణ్, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న చైర్ పర్సన్ వసుపతి ప్రణీత


కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం కుష్టుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టు నివారణపై డాక్టర్ వెంకన్న ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ.. చర్మంపై స్పర్శ కోల్పోయిన మచ్చలు ఉంటే సత్వరమే చికిత్స తీసుకోవాలని చెప్పారు. చికిత్సతో కుష్టువ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. మహాత్మా గాంధీ కలలుగన్న కుష్టు రహిత భారతదేశం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రాజ మల్లయ్య, డీఈఈ చిరంజీవులు, కౌన్సిలర్లు రామారం శ్రీహరి, ఏఎన్ఎం రేచల్, సిస్టర్ శివ పార్వతి, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతా నుంచి అక్రమంగా నగదు బదిలీ

పోచారం: ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.50 లక్షల నగదు అక్రమంగా బదిలీ అయినట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాకలోని ఇండస్ ఇండ్ బ్యాంక్‌లో ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన ఓ వ్యక్తి ఖాతా ఉంది. కాగా, ఈ వ్యక్తి ఖాతా నుంచి రూ.49,999 చొప్పున మూడు వేర్వేరు అకౌంట్లకు తనకు తెలియకుండా నగదు బదిలీ కావడంతో బ్యాంకు అధికారులతో పాటు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి


ఎదులాబాద్‌లో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రాగారెడ్డి అన్నారు. ఎదులాబాద్, మాదారం, మర్పల్లిగూడలో జెడ్పీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీని సోమవారం ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఎదులాబాద్‌లో రూ.6.67 లక్షలతో సీసీ రోడ్డు, రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, మాదారంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, మర్పల్లిగూడలో రూ.13.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించామన్నారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి మరిన్ని పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సరళ, శోభారాణి, రవి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ఉదయ్‌రెడ్డి, ఎక్బాల్, ప్రత్యేక అధికారులు ఎంపీఓ నందకిశోర్, బలరాం, నాయకులు కుమార్‌ముదిరాజ్, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జంగారెడ్డి, వెంకటేశ్‌ముదిరాజ్, బాలవెంకట్, రాముముదిరాజ్, అమర్, లింగంముదిరాజ్, ఓంప్రకాశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అసమ్మతి జ్వాలలు

ప్రతి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్‌లో రెండు గ్రూపులు

- సొంత పార్టీ చైర్మన్లపైనే అవిశ్వాసా నికి నోటీసులు
- ఇంకా క్యాంపుల్లోనే కౌన్సిలర్లు, కార్పొరేటర్లు
- ఎమ్మెల్యే మల్లారెడ్డికి తలనొప్పిగా రాజకీయం
- చక్రం తిప్పుతున్న సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్



మేడ్చల్: రాష్ట్రంలో ప్రజాతీర్పునకు అనుగుణంగా అధికార మార్పు జరగడంతో మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో అసమ్మతి జ్వాలలు రేగుతున్నాయి. నవంబర్ ఒకటి వరకు ఏకతాటిపై కనిపించిన బీఆర్‌ఎస్ నేతల్లో నెలకొన్న అసమ్మతి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బయటపడుతోంది. నియోజకవర్గంలో 7 మున్సిపాలిటీలు, 3 మున్సిపల్ కార్పొరేషన్లు ఉండగా 2 కార్పొరేషన్లు, 4 మున్సిపాలిటీల్లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల మధ్య అసమ్మతి తారాస్థాయిలో నడుస్తోంది. గత ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయం ఒక్కసారిగా మారిపోయింది. కొందరు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడం, మరికొందరు బీఆర్‌ఎస్‌లో ఉంటూ పదవుల కోసం కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుండటంతో రాజకీయం ఆసక్తిగా మారింది.

విహార యాత్రలకు తీసుకెళ్లినా..

తన నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీలో అసమ్మతి ఉందని, వారిని శాంతింపజేసేందుకు కౌన్సిలర్లను మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి విహార యాత్రలకు తీసుకెళ్లి శాంతింపజేసే యత్నాలు చేసినా అవి సఫలం కావడం లేదు. గోవా, దుబాయ్ వంటి ప్రాంతాలకు సొంత పార్టీ కౌన్సిలర్లను ఆయన తీసుకెళ్లారు. కౌన్సిలర్లను శాంతింపజేసేందుకు కౌన్సిలర్లను విహారయాత్రలకు తిప్పుతున్నాని ఎమ్మెల్యే మల్లారెడ్డి స్వయంగా ప్రకటించారు. మాజీ మంత్రి తన పట్టుకోల్పోకుండా ప్రయత్నాలు చేస్తున్న మున్సిపాలిటీలలో అసమ్మతి జ్వాలలు మాత్రం ఆగడం లేదు.

పీర్జాదిగూడ, జవహర్‌నగర్‌లలో..

మూడు కార్పొరేషన్‌లలో రెండింటా అసమ్మతి జోరుగా నడుస్తోంది. నియోజకవర్గంలోని పీర్జాదిగూడ, జవహర్‌నగర్‌లలో 15 రోజులుగా బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు రెండు గ్రూపులుగా విడిపోయి మేయర్‌లను పీఠంపై నుంచి దించడానికి క్యాంపు రాజకీయాలు నడిపిస్తున్నారు. పీర్జాదిగూడలో ఎమ్మెల్లే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పోటాపోటీగా రాజకీయాలు నడిపిస్తున్నారు. కార్పొరేటర్లు విడిపోయి క్యాంపుల్లో ఉంటూ రాజకీయం చేస్తున్నారు. జవహర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు రెండు వర్గాలుగా విడిపోయి ఈ నెల 19న అవిశ్వాస పరీక్షకు సిద్ధమయ్యారు.

తాజాగా అవిశ్వాసం నోటీసులు

నియోజకవర్గంలోని నాగారం, తూంకుంట మున్సిపాలిటీల్లో తాజాగా సోమవారం బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసులు అందజేశారు. గతంలోనే దమ్మాయిగూడ కౌన్సిలర్లు, మేడ్చల్ కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసులు ఇచ్చినా తేదీలు ఖరారు కాలేదు. నియోజకవర్గంలోని 7 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్‌లలో బీఆర్‌ఎస్‌కు సంపూర్ణంగా బలం ఉన్నా నేతలకు పదవీ ఆశలు, రాష్ట్రంలో అధికారం లేకపోవడంతో కర్ర పెత్తనం లేకపోవడంతో బీఆర్‌ఎస్‌లో కొంతమంది నాయకులు స్వపక్షంలో విపక్ష నాయకులుగా మారి ఎమ్మెల్యే మల్లారెడ్డికి లేనిపోని తలనొప్పులు తెచ్చిపెడుతున్నారు.

చక్రం తిప్పుతున్న కాంగ్రెస్ నేతలు..

మేడ్చల్‌లో గెలవకున్నా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మేడ్చల్ బీఆర్‌ఎస్‌లో కాంగ్రెస్ నాయకులు చిచ్చుపెడుతున్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డిపై ఆధిపత్యం చాటుకోవడానికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన వజ్రేష్ యాదవ్ అవకాశం చిక్కిన ప్రతిసారీ పావులు కదుపుతూ బీఆర్‌ఎస్‌లో చిచ్చుపెట్టి తమ పార్టీకి మద్దతు పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నేతలకు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే మల్లారెడ్డి తాయిలాలు ఇస్తూ, అన్ని పనులు చేస్తూ, గోవా, దుబాయ్ లాంటి ప్రాంతాలకు తిప్పుతున్నా నేతల మధ్య అసమ్మతి మాత్రం తగ్గడం లేదు.

బ్రిడ్జి పనులు షురూ.. గేటు బంద్..





మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే గేట్ వద్ద పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. బ్రిడ్జి పనులు ప్రారంభమైనందున గేట్‌ను పూర్తిగా మూసివేసినట్లు, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల మీదుగా వెళ్లాలని అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మేడ్చల్‌లో అసంపూర్తిగా ఉన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో మండలంలోని రాయిలాపూర్, గిర్మాపూర్, తదితర గ్రామాల ప్రజలు గౌడవెల్లి మీదుగా మేడ్చల్‌కు వచ్చేవారు. తాజాగా గౌడవెల్లిలో గేట్ మూతపడటంతో అయోధ్య చౌరస్తా, లేదా డబీల్‌పూర్ రూట్ల నుంచి ఈ గ్రామాల ప్రజలు మేడ్చల్‌కు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కౌన్సిలర్ భర్తపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్: పాత పగను మనసులో పెట్టుకొని ఓ కౌన్సిలర్ భర్తపై దాడి చేసిన వ్యక్తిపై ఘట్‌కేసర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీలోని శివారెడ్డి మారుతీనగర్‌లో మూడో వార్డు కౌన్సిలర్ భర్త బొక్క ప్రభాకర్‌రెడ్డి తమ సమీప బంధువు సోమవారం మరణించడంతో అంత్యక్రియలకు హాజరయ్యాడు. అదను చూసుకొని అదే అంత్యక్రియల్లో పాల్గొన ఎన్ఎఫ్‌సీనగర్ మాజీ ఉప సర్పంచ్ కొమ్మిడి మహిపాల్‌రెడ్డి వెనుక వైపు నుంచి ప్రభాకర్‌రెడ్డిని కాలితో తన్నడంతో పాటు కర్రతో దాడి చేశాడు. స్థానికులు ఆపడంతో గొడవ సద్దుమణిగింది. గతంలో ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంపై దాడి చేసిన ఘటనలో మహిపాల్‌రెడ్డిపై కేసు నమోదైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని వినతి



ఘట్‌కేసర్: రైల్వే వంతెన పనుల కారణంగా వేలాది వాహనాలు, విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు శ్యామ్‌కిరణ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీకి సోమవారం వినతి అందజేశారు. వాహనాలు, ప్రయాణికులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించడంలో అధికారులు విఫలం కావడంతో వాహనదారులు చిన్నచిన్న గల్లీ రోడ్లపై వెళ్తుండటంతో రద్దీ పెరిగి ఇబ్బందిగా మారుతున్నాయన్నారు. ఏబీవీపీ ఘట్‌కేసర్ పట్టణ కార్యదర్శి భాను, రాష్ట్ర టెక్ సెల్ సభ్యుడు సచిన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

డిజైన్ థింకింగ్‌పై అవగాహన అవసరం


విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న శృతిభార్గవ్

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు డిజైన్ థింకింగ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని శ్రీనిధి సెంటర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ ప్రతినిధి డాక్టర్ శృతిభార్గవ్ చౌబే అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శృతి భార్గవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను దేశంలోని అందరికీ అందించాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ చేపట్టినట్లు తెలిపారు. డిజైన్ థింకింగ్ అంటే ఏమిటి, దాని ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, సెక్రటరి టీవీ రెడ్డి మాట్లాడుతూ 2047లో మనం ఎలా ఉండాలి అనేది ప్రస్తుత రోజుల్లో ఉన్న వనరులను ఉపయోగించుకునే విధానం, మన ఆలోచనలకు బట్టి ఉంటుందన్నారు. నూతన టెక్నాలజీ అందిపుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ చేస్తున్న కృషి కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, కో ఆర్డినేటర్లు సరిత, షణ్ముఖప్రియ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక్క రోజే.. 150 ఫిర్యాదులు

- కలెక్టరేట్ ప్రజావాణికి పెరుగుతున్న అర్జీలు
- కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 670పైగా..
- భూసంబంధిత వాటిలో కబ్జాలే అధికం
- ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న ఆశతో..


ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న లాఫీసర్ చంద్రావతి తదితరులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల అర్జీల తాకిడి పెరుగుతోంది. జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రజావాణికి హాజరవుతుండటంతో తమ సమస్యలకు వెంటనే పరిష్కారం దొరుకుతుందనే ఆశలు ఫిర్యాదుదారుల్లో వ్యక్తం అవుతోంది. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చేపట్టిన ప్రజావాణిలో 150 ఫిర్యాదులు ప్రజల నుంచి అందాయి. ఇందులో భూసంబంధిత సమస్యలు, ధరణి ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత భూసంబంధిత వాటితో సహా అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకం ప్రజల్లో పెరిగింది. 50 రోజుల వ్యవధిలో మేడ్చల్ కలెక్టరేట్‌లో పలు పర్యాయాలు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 670కి పైగా అర్జీలు ప్రజల నుంచి వచ్చినట్లు తెలుస్తోంది.

శివార్లుల్లో భూసమస్యలే అధికం..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో భూసమస్యలకు సంబంధించి ధరణి, భూకబ్జాలు, ప్రభుత్వ, సీలింగ్, దేవాదాయ, అసైన్డ్ భూముల పరిరక్షణ, ఇళ్ల స్థలాలు తదితర వాటికి సంబంధించిన అర్జీలు అధికంగా ఉంటాయి. ఈ సమస్యలపైనే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు వెల్లువలా వస్తుంటాయి. తమ సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులకు మొర పెట్టుకోవడానికి జిల్లా నలుమూలల నుంచి బస్తీ, గ్రామ, పట్టణవాసులు తరలివస్తున్నారు.

శివార్లుల్లో భూసమస్యపై ప్రత్యేక దృష్టి

నగర శివార్లుల్లో ముఖ్యంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని భూసమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సంబంధిత కలెక్టర్లకు కూడా ఉన్నతాధికారుల నుంచి భూసమస్యల పరిష్కరంపై ఆదేశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో రెవెన్యూ శాఖ ప్రత్యేక చొరవ కనబరుస్తోంది. అందులో భాగంగానే జిల్లాలో పలుచోట్ల ప్రభుత్వ భూముల్లో వెలసిన వందలాది అక్రమ నిర్మాణాలను ఇటీవల టాస్క్ ఫోర్స్ టీమ్‌లు తొలగించాయి. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 150 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా లా ఆఫీసర్ చంద్రావతితో సహా వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తాం



సాక్షి, మేడ్చల్ జిల్లా: రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్లకు సంబంధించి మొదటి స్థాయి పరిశీలన(ఫస్ట్ లెవల్ చెకప్) క్షుణ్ణంగా చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఫస్ట్ లెవల్ చెకప్(ఎఫ్ఎల్‌సీ)ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎమ్), వీవీ ప్యాట్లకు సంబంధించి ఆయన మొదటి విడత తనిఖీ నిర్వహించారు. ఫస్ట్ లెవల్ చెకప్ కార్యక్రమాన్ని ఈ నెల14 వరకు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా ఈవీఎమ్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) నిర్వహిస్తామని, ఈవీఎంపై ఎలాంటి అనుమానాలకు చోటు లేకుండా ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రాథమికంగా పరిశీలన(ఎఫ్ఎఎల్‌సీ) జరిపేందుకు ఈసీఐఎల్ చెందిన 26 మంది సాంకేతిక నిపుణుల బృందం జిల్లాకు చేరుకుందని పేర్కొన్నారు. ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు.

నాగారం చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం


అవిశ్వాస తీర్మాన పత్రం అందజేస్తున్న నాగారం కౌన్సిలర్లు

కీసర: నాగారం పురపాలక సంఘం బీఆర్‌ఎస్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్‌పై 14 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఇందులో భాగంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అవిశ్వాస నోటీసు అందజేశారు. నాగారం మున్సిపాలిటీలోని మొత్తం 20 మంది కౌన్సిలర్లలో 14 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన పత్రంపై సంతకాలు చేశారు. వీరిలో ముగ్గురు కాంగ్రెస్, ఒకరు బీజేపీ, పది మంది బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. నాలుగేళ్లుగా తమ వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, అందుకే ఆగ్రహంతో అవిశ్వాసం దిశగా అడుగులు వేశామని చెప్పారు. చైర్మన్, వైస్ చైర్మన్లు కేవలం పదవులు అనుభవించడానికే ఉన్నారని, వీరి పోకడకు అవిశ్వాసంతో అడ్డుకట్ట వేయాలని ముకుమ్మడిగా ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు.

తూంకుంట మున్సిపాలిటీలో అవిశ్వాస జ్వాల

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీలో అవిశ్వాస జ్వాలలు మొదలయ్యాయి. బీఆర్‌ఎస్ పార్టీలోని పలువురు అసమ్మతి కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ప్రస్తుత చైర్మన్, వైస్ చైర్మన్‌లను తప్పించాలని సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. తూంకుంట మున్సిపాలిటీలో 16 మంది కౌన్సిలర్లు ఉండగా 11 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

క్యాంపుల్లో కౌన్సిలర్లు..

తూంకుంట మున్సిపాలిటీ చైర్మన్ రాజేశ్వరరావుతో పాటు వైస్‌చైర్మన్ మరో ముగ్గురు కౌన్సిలర్లు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి గోవాకు వెళ్లినట్లు సమాచారం. ఇటు బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు, కాంగ్రెస్ కౌన్సిలర్లు(మొత్తం 11 మంది) అవిశ్వాస వినతి పత్రం అనంతరం ఇతర ప్రాంతాలకు క్యాంపునకు తరలివెళ్లినట్లు సమాచారం.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



శామీర్‌పేట్: తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్(టీడీఎఫ్), జైకిసాన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహంపై అవగాహన కార్యక్రమం సోమవారం మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలో నిర్వహించారు. ఈడీఎఫ్ ఇండియా ప్రెసిడెంట్ మట్ట రాజేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఉత్తమ రైతు ప్రసాద్‌రెడ్డి, ఏఓ కృష్ణవేణి పాల్గొని మాట్లాడారు. రసాయన మందులతో వ్యవసాయం చేయడం ద్వారా నేల సారాన్ని కోల్పోయి రోజు రోజుకూ క్షీణిస్తోందని రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక నాణ్యత, అధిక దిగుబడి పొందుతారని, ప్రకృతి వ్యవసాయం రైతులు దృష్టి సారించాలని సూచించారు. టీడీఎఫ్ – జైకిసాన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తెలంగాణలో ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేందుకు 25 గ్రామాలు, 25 కూరగాయలు, 250 మంది రైతులు, మన విత్తనాలు, మన పంటలు, మన ఆరోగ్యం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వస్తున్నట్లు ఈడీఎఫ్ ఇండియా ప్రెసిడెంట్ మట్ట రాజేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కేవీకే రెడ్డి, నర్సింహారెడ్డి, దశ్రత్, నరేష్ రెడ్డి, బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

బోధన పద్ధతులను మెరుగుపర్చుకోవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీహెచ్‌ఈఎల్ డైరెక్టర్ మోహన్‌రావు

మేడ్చల్‌రూరల్: సాంకేతిక ప్రపంచంలో అధ్యాపకులు బోధన పద్ధతులను మెరుగు పర్చుకోవడమే కాకుండా సాంకేతికతతో విద్యార్థులకు బోధన అందించాలని బీహెచ్‌ఈఎల్ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ మోహన్‌రావు తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 5 రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. హెచ్‌సీయూ ప్రొఫెసర్లు చక్రవర్తి భగవతి, రుక్మరేఖ, కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత తదితరులు మాట్లాడుతూ డిజిటల్ యుగంలో అభివృద్ధి చెందడానికి విద్యార్థులను శక్తివంతం చేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. కళాశాల డీన్‌లు, టీపీఓ, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో మరో గోల్‌మాల్

- ట్యాక్స్ డబ్బులు తీసుకొని రశీదు ఇవ్వని వైనం
- రశీదు అడిగితే దాటవేస్తున్న కార్యాలయం ఆపరేటర్
- గతంలో రూ.13 కోట్లు చేతివాటం చూపిన ఆపరేటర్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఇంటి ట్యాక్స్ నిధులు గోల్‌మాల్ వ్యవహారం మరోమారు బయట పడింది. గతంలో మున్సిపాలిటీలో వసూలు చేసిన ఇంటి పన్నుల నిధులు కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ బ్యాంకులో డిపాజిట్ చేయకపోవడంతో దాదాపు రూ.13 కోట్లు అవకతవకలు జరిగినట్లు ఆడిట్‌లో తేలడంతో సంబంధిత అధికారులు బాధ్యత వహిస్తూ తిరిగి చెల్లించిన ఘటన మరువక ముందే తిరిగి అలాంటి ఘటన తనకు జరిగిందని బాధితుడు ఆరోపిస్తున్నాడు. పట్టణానికి చెందిన దాసరి బాలనర్సింహ తన ఇంటి ట్యాక్స్ చెల్లించగా రశీదు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆరోపించడంతో గోల్‌మాల్ వ్యవహారం జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి ట్యాక్స్ తీసుకొని రశీదు ఇవ్వడం లేదు..

మున్సిపాలిటీకి చెందిన దాసరి బాలనర్సింహ 200 గజాల స్థలంలో షెడ్డు నిర్మాణం చేపట్టాడు. ఇంటి నంబర్ కోసం జూలై 19, 2023న మున్సిపల్ కార్యాలయంలో రూ.48,500లు కంప్యూటర్ ఆపరేటర్ అనితకు చెల్లించగా 5–13/2 ఇంటి నంబర్ కేటాయించారు. ట్యాక్స్ తీసుకొని రశీదు మాత్రం ఇవ్వలేదు. రశీదు అడిగితే డబ్బులు కౌన్సిలర్ బండారి ఆంజనేయులు దగ్గర ఉన్నాయని ఆపరేటర్ చెబుతూ కాలాయాపన చేస్తోందని బాధితుడు ఆరోపించాడు. కంప్యూటర్ ఆపరేటర్ ట్యాక్స్ డబ్బులు తీసుకొని కౌన్సిలర్ పేరు చెబుతుండంతో అనుమానం వచ్చి రశీదు వ్యవహారంపై విచారణ జరిపి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాలనర్సింహ ఘట్‌కేసర్ కమిషనర్, కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశాడు. గతంలో రూ.13 కోట్ల గోల్‌మాల్, తాజాగా రశీదు ఇవ్వని వ్యవహారం బయటపడటంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే డొక్కాడని పేదల దగ్గర ముక్కుపిండి వసూలు చేసిన ట్యాక్స్ డబ్బులకు గ్యారెంటీ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పన్ను రశీదు విషయమై దాసరి బాలనర్సింహ చేసిన ఆరోపణలపై సంస్థాపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.